క్లుప్తంగా

భారీ వాహనంతో స్తంభించిన ట్రాఫిక్



భారీ వాహనం వెళుతుండగా ఇబ్బంది పడుతున్న చిన్న వాహనాలు

చిల్లకూరు : మండల కేంద్రమైన చిల్లకూరులో శనివారం భారీ వాహనంతో ట్రాఫిక్ స్తంభించింది. చెన్నై నుంచి విశాఖపట్టణానికి భారీ యంత్రాలను తరలిస్తున్న వాహనం చిల్లకూరు సమీపంలోని జాతీయ రహదారిలోకి వచ్చింది. దీంతో చిన్న వాహనాలు సైతం వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. వాహనాలు బారులు తీరాయి. ఇలాంటి భారీ వాహనాలు బయలుదేరే సమయంలో పైలెట్‌గా మరో వాహనం రావాల్సి ఉంది. అలాంటిదేమీ లేకుండా భారీ వాహనం నడుస్తుండడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు.

మొక్కు తీర్చాలని..



చిట్టమూరు రొయ్యల వాగు బ్రిడ్జిపై వెళుతున్న తండ్రి, కొడుకు

చిట్టమూరు : చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో కొలువైన ముత్యాలమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని చెన్నై కోయంబేడుకు చెందిన తండ్రి శ్రీనివాసన్, అతని కుమారుడు కిశోర్ కాలి నడకన వెళుతున్నారు. వారు శనివారం చిట్టమూరు మండలంలోకి చేరుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా చలించకుండా కాలినడకన వెళుతున్నారు. తమ కుటుంబంలో నెలకొన్న సమస్యలు పరిష్కారమైతే ఆలయానికి వస్తామని మొక్కుకున్నామని తెలిపారు. అమ్మవారి మాల వేసి 41 రోజులు దీక్ష చేపట్టామని, ఇప్పుడు మొక్కు తీర్చుకునేందుకు కాలినడకన వెళుతున్నట్టు తెలిపారు. అమ్మవారిని ఆదివారం దర్శించుకుంటామని పేర్కొన్నారు.

పిల్లలకు ఉచిత ఖత్నాలు



ఉచిత ఖత్నాలు చేయించుకున్న చిన్నారులతో నెట్ వర్క్ ప్రతినిధులు

గూడూరు రూరల్: ఇస్లాం సంప్రదాయం ప్రకారం ప్రతి ముస్లిం మగ పిల్లవాడు తప్పనిసరిగా ఖత్నా చేయించుకోవాలని మహ్మదీయ వెల్ఫేర్ నెట్‌వర్క్ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ తెలిపారు. గూడూరు పట్టణంలోని షాదీ మంజిల్‌లో శనివారం సుమారు 100 మంది పిల్లలకు ఉచితంగా ఖత్నా చేయించారు. ఆయన మాట్లాడుతూ ఒకరికి ఖత్నా చేయించాలంటే రూ.5 వేల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. పేదలు అంత ఖర్చు పెట్టుకోలేరని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మహబూబ్‌బాషా, నాజర్, అజీజ్‌ఖాన్, అల్లీ హుస్సేన్, యూసఫ్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి కోర్టులో మేడే వారోత్సవాలు



మే డే వేడుకల్లో జడ్జి, న్యాయవాదులు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం జడ్జి ఎస్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాలు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ మేడే వారోత్సవాల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. న్యాయవాదులు రాజారాం, రాజేష్, పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ట్యాంకర్

- డ్రైవర్ మృతి, క్లీనర్‌కు తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్ : మండలంలోని విన్నమాల జాతీయ రహదారి కూడలి సమీపంలో శనివారం ట్యాంకర్ లారీ ముందు వెళుతున్న మరో లారీని ఢీకొంది. దీంతో ట్యాంకర్ లారీ డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఖాళీ ట్యాంకర్ నెల్లూరు నుంచి చెన్నై వెళుతోంది. నాయుడుపేట సమీపంలో ముందు వెళుతున్న మరో లారీని ఢీకొంది. ట్యాంకర్ లారీ డ్రైవర్ చెన్నైకి చెందిన సతీష్(35) క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న సీఐ బాబి, పోలీసులు అక్కడికి చేరుకుని అతన్ని బయటికి తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో చెన్నై తీసుకెళుతుండగా మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన క్లీనర్ జ్ఞానవేల్ స్థానికంగా ఉన్న ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ల ఆవిష్కరణ

ఓజిలి: త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఇందు జ్ఞానవేదిక శ్రీకాళహస్తి కమిటీ రూపొందించిన తెలుగు ఉగాది క్యాలెండర్లను శనివారం డీటీ మధుసూదన్‌రాజు, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎస్‌ఐ స్వప్న ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను ఆయా కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, సిబ్బందికి అందజేశారు.

భానుడి భగభగలు



- రోజురోజుకూ పెరుగుతున్న ఎండలు
- వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు



ప్రజలు లేక వెలవెలబోతున్న ఓజిలి తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు

చిల్లకూరు/ఓజిలి : రోజురోజుకూ ఎండలు పెరుగుతున్నాయి. ఉదయం 10 గంటలకే భానుడు భగభగమంటున్నాడు. ఇళ్ల నుంచి బయటికి రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. గూడూరు డివిజన్‌లో పగలు 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో పనుల నిమిత్తం బయటికి వచ్చే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. లేదంటే వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఎక్కువగా నీరు తాగాలని, తలపై టోపీ లేదా టవల్ వేసుకోవాలని పేర్కొంటున్నారు. ఎండ దెబ్బ తగిలినప్పుడు వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్య చికిత్స పొందాలి. వృద్ధులు, చిన్న పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. అత్యవసరమైతేనే తప్ప బయటకు వెళ్లకూడదని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు. అత్యవసరమై బయటకు వెళ్లాల్సి వస్తే ఉదయమే వెళ్లి ఎండ తీవ్రం కాకముందే ఇంటికి చేరుకోవాలని పేర్కొంటున్నారు. వడదెబ్బకు గురి కాకుండా ఉండేలా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. లేనిపక్షంలో వడదెబ్బకు గురై ప్రాణాపాయం కలిగే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. గత వారంలో వాకాడు టెంకాయతోపు కాలనీకి చెందిన మునీంద్ర(35) కూలి పనులకు వెళ్లి తిరిగి వచ్చిన అనంతరం వడదెబ్బ తగిలి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పల్లెల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని చెబుతున్నారు. లేత రంగులు, కాటన్ దుస్తులు ధరించాలని వెల్లడిస్తున్నారు.



వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

చేయకూడనవి...

- ఎండ తీవ్రత, అధిక ఉష్ణోగ్రత ఉన్న సమయంలో బయట తిరగరాదు.
- మద్యం సేవించరాదు. రోడ్డు మీద విక్రయించే కలుషిత ఆహారం తీసుకోకూడదు.
- రోడ్డు పక్కన విక్రయించే చల్లని రంగు పానీయాలు తాగరాదు.
- మాంసాహారం తగ్గించి తాజా ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలి.

గూడూరు డివిజన్‌లో నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	పగలు (డిగ్రీలు)	రాత్రి (డిగ్రీలు)
ఏప్రిల్–25	43	32
ఏప్రిల్–26	42	28
ఏప్రిల్–27	44	30
ఏప్రిల్–28	44	30
ఏప్రిల్–29	45	35
ఏప్రిల్–30	45	36

వడదెబ్బ లక్షణాలు

ఇది ప్రాణాంతకమైనది. శరీరంలో ఉష్ణోగ్రత నియంత్రణ శక్తి కోల్పోతుంది. శరీర ఉష్ణోగ్రత బాగా పెరిగిపోతుంది. శరీరంలోని అన్ని అవయవాలపై ప్రభావం చపుతుంది. ముఖ్యంగా పిల్లలు, పెద్ద వయస్సు వారికి తీవ్ర ఇబ్బంది కలిగిస్తుంది. వడదెబ్బ తగిలితే చర్మం ఎర్రగా మారుతుంది. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది. శరీరంపై ఎర్రని పొక్కులు వస్తాయి. నీరసంగా ఉండడం, తీవ్రమైన జ్వరం, తలనొప్పి, మానసిక ఒత్తిడి పెరగడం, కళ్లు తిరగడం, వాంతులు, విరేచనాలు తదితర లక్షణాలు ఉంటాయి.

డీ హైడ్రేషన్

ఎండ తీవ్రత కారణంగా శరీరంలో వచ్చే డీ హైడ్రేషన్ కారణంగా వాంతులు, జ్వరం వస్తాయి. శరీరంలో నీటి శాతం తగ్గిపోయి కళ్లు తిరగడం, ఎక్కడ పడితే అక్కడ పడిపోతారు.

అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోలేము



శరీరం తగినంత ఉష్ణోగ్రతను మాత్రమే తట్టుకుంటుంది. ఎండలో తిరిగినప్పుడు శరీరం నీరసంగా మారుతుంది. వాంతులు, విరేచనాలు వస్తాయి. ఒక్కొక్కసారి ప్రాణా ల మీదకు వస్తుంది. తక్షణం ఉప్పు, చెక్కెర కలిపిన నీటిని కొద్ది కొద్దిగా తాగించి సమీపంలోని ఆస్పత్రికి తీసుకుని వెళ్లాలి. – కలపాటి శేఖర్, ఆయుర్వేద వైద్యులు, మోమిడి

వెంటనే వైద్యులను సంప్రదించాలి



వడదెబ్బ తగిలిన వారికి ఇంటి వద్ద సొంత వైద్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించాలి. చికిత్స అందించి వారి శరీరంలో నీటి శాతం పెరిగేలా చూడాలి. వేసవిలో ఇంటి వద్ద నీరు, మజ్జిగ ఎక్కువగా తాగాలి. తద్వారా వడదెబ్బ తగ లకుండా జాగ్రత్తగా ఉండవచ్చు. – అరాఫత్, వైద్యులు, చిల్లకూరు పీహెచ్‌సీ

ప్రయాణాలను రద్దు చేసుకోవాలి



ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో ప్రయాణాలు రద్దు చేసుకోవడం మంచిది. నీరు ఎక్కువగా తాగాలి. ఉప్పు కలిపిన నీరు, మజ్జిగ, గ్లూకోజ్‌లను తీసుకుంటే మంచిది. ఓఆర్ఎస్ ద్రావణం తాగాలి. – వినీషా, పెదపెరియ పీహెచ్‌సీ వైద్యాధికారిణి, ఓజిలి మండలం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని పాలకేంద్రం 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేస్తున్నందున ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు డీఈ రవిమునిచంద్ర తెలిపారు. వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో ఆదివారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు వ్యవసాయ మోటార్లకు వచ్చే విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సీఐటీయూ నేతలు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని శివాలయం వద్ద శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ నాయకులు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. సీఐటీయూ తిరుపతి జిల్లా అధ్యక్షుడు బీవీ రమణయ్య మాట్లాడుతూ రోజు రోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోందన్నారు. పనుల మీద బయటకు వచ్చిన ప్రజలకు మజ్జిగ అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆటో స్టాండ్‌ను ఏర్పాటు చేసి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌కే షఫీ, అధ్యక్షుడిగా ఎస్‌కే మౌలా, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కే సలీం, కార్యదర్శిగా ఎస్‌కే మున్నా, సహాయ కార్యదర్శిగా కళ్యాణ్, కోశాధికారిగా రోహిణి ఎంపికయ్యారు. కార్యక్రమంలో అక్బర్, పవన్, తాజుద్దీన్, ప్రసాద్, గోపి, శ్రీను, ఎస్‌కే కాలేషా, గిరి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల్లో అవకతవకలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మీ ఏపీవోను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ పంటల సాగుకు ప్రభుత్వం తెలుగు గంగ నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు, వరి విత్తనాలు అందుబాటులో ఉంచాలని వ్యవసాయాధికారి గణేష్‌కు సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఆదేశించారు. అనంతరం అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. సమావేశంలో ఎంపీడీవో సురేష్‌బాబు, జెడ్పీటీసీ కట్టా జ్యోతిరెడ్డి, వెటర్నరీ ఏడీ గోవర్ధన్ రెడ్డి, ఈవోపీఆర్‌డీ మల్లు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 45.132 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 45.132 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 160, పిన్నేరు కాలువకు 100, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



కమ్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మేరిగ మురళీధర్

చిల్లకూరు : వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. మండలంలోని ముత్యాలపాడుకు చెందిన ఇరువూరు కమ్మయ్య తల్లి పెంచలమ్మ (74) శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మురళీధర్ గ్రామానికి చేరుకుని ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటామన్నారు.

పార్టీని పటిష్ట పరిచేలా వార్డుల కమిటీలు

గూడూరు మున్సిపాలిటీలో వైఎస్సార్ సీపీని పటిష్ట పరిచేలా వార్డు కమిటీలను నియమిస్తున్నట్టు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. ఆయన గూడూరులోని సనత్‌నగర్‌లో వున్న తన నివాసంలో పార్టీ కార్యకర్తలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు ఇస్తామన్నారు.

అనుమతులు లేని నిర్మాణాల పరిశీలన



కట్టడాల కొలతలు తీసుకుంటున్న సిబ్బంది

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణం పోగొట్టం కాలనీలో మున్సిపాలిటీ అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలను శనివారం టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించారు. కొలతలు తీసుకున్నారు. పోగొట్టం కాలనీలోని భూములపై వివాదం నడుస్తోంది. అక్కడ ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నవారు, వెంకటగిరి రాజా కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో కోర్టు ఉత్తర్వులు వచ్చే వరకు ఎవరూ భూముల క్రయ విక్రయాలు చేయరాదని, నిర్మాణాలు చేపట్టరాదని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఆదేశించారు.

యాచకుడికి పోలీసుల అంత్యక్రియలు



అంత్యక్రియలు చేస్తున్న సీఐ ఏవీ రమణ, పోలీసులు

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని విశ్వోదయ కళాశాల భవనం సమీపంలో గుర్తు తెలియని యాచకుడు (70) మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వెంకటగిరి సీఐ ఏవీ రమణ అక్కడికి చేరుకుని పరిశీలించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో శనివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ యాచకుడు ఈ నెల 1వ తేదీన మృతి చెందినట్టు తెలిపారు. మృతదేహాన్ని వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీలో ఉంచి ఆచూకీ కోసం ప్రయత్నం చేశామన్నారు. అతని వివరాలు తెలియకపోవడంతో పోలీసుశాఖ ఆధ్వర్యంలో మున్సిపల్, ఆటో యూనియన్ నాయకుల సహకారంతో సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీభవాని, ఏఎస్ఐ బీవీ రమణ, మున్సిపల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సహజ వనరుల దోపిడీ ఆపాలి



నిరసన ప్రదర్శన చేస్తున్న చింతా మోహన్ తదితరులు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాల్లో వున్న సహజ వనరులను దోచుకుంటున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. ఆయన శనివారం కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి సూళ్లూరుపేటలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ చిల్లకూరు మండలంలో సిలికా ఇసుక, సైదాపురం మండలంలో క్వార్ట్జ్, సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణాల్లో ఇసుక, గ్రావెల్ దోపిడీ విచ్చలవిడిగా జరుగుతోందన్నారు. ఒకరిద్దరు పెద్దమనుషులుగా చలామణి అవుతున్న వారే ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. ఈ సహజ వనరులను ఎస్సీ, ఎస్టీ, బీసీల్లోని నిరుద్యోగ యువకులకు ఇస్తే నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుపతి ప్రాంతానికి చెందిన వాడైనప్పటికీ రాజధానిని తిరుపతికి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. ప్రధాని మోదీని తీసుకొచ్చి అమరావతిని మరోసారి భ్రమరావతిగా మార్చారని దుయ్యబట్టారు. ఈ ప్రాంతంలో శ్రీహరికోట, శ్రీసిటీ తప్ప ఏమున్నాయని ప్రశ్నించారు. యూపీఏ ప్రభుత్వం దుగరాజపట్నం ఓడరేవు, వెంకటగిరి వద్ద మన్నవరం భెల్ కంపెనీ మంజూరు చేసిందని తెలిపారు. ప్రస్తుతం అవి ఆగిపోయినా చంద్రబాబు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో అవినీతి రాజ్యమేలుతోందన్నారు. తహసీల్దార్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు అవినీతి మయంగా మారాయని విమర్శించారు.

కిశోరి వికాసంపై శిక్షణ



నెలబల్లిలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దొరవారిసత్రం : మండలంలోని నెలబల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పంచాయతీ స్థాయిలో కిశోరి వికాసంపై బాలింతలు, గర్భిణులు, బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై వివరించారు. కౌమార దశలో రక్త హీనత, పోక్సో చట్టం, రుతు క్రమం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుజాత, రమణమ్మ, మహిళా పోలీసు అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మలమ్మ, భారతి పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం

తడ: కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూళ్లూరుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సంయుక్త తెలిపారు. మండలంలోని మాంబట్టులోవున్న అపాచి బూట్ల పరిశ్రమలో శనివారం కార్మికుల చట్టాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం అమలుచేస్తున్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూళ్లూరుపే ట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కరీం, ఈసీ మెంబర్ నత్తం శ్రీనివాసులు, న్యాయవాదులు విజయమ్మ, చక్రవర్తి, మాలకొండయ్య, హేమంత్, చలపతి, సౌమ్య, సౌజన్య పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామి, అమ్మవార్లను సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కై ంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. 6 గంటకు పూలంగి సేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపంలో కొలువుదీర్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. సాయంత్రం ఊంజల్ సేవ చేశారు.

నిందితుడిని అరెస్ట్ చేయాలని నిరసన



పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడుతున్న తిన్నెలపూడి గిరిజన కాలనీవాసులు

కోట: తిన్నెలపూడి గిరిజన కాలనీకి చెందిన శ్రీనివాసులు మృతికి కారణమైన వెంకటరమణయ్యను అరెస్ట్ చేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. వారు శనివారం కోట పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎస్ఐ పవన్‌కుమార్‌తో మాట్లాడారు. రోడ్డు ప్రమాదంలో శ్రీనివాసులు మృతి చెందగా కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేయడం లేదన్నారు. అదేవిధంగా శ్రీనివాసులు మృతితో ఆ కుటుంబం వీధిన పడిందని తెలిపారు. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. న్యాయం జరగని పక్షంలో గిరిజన సంఘాల నాయకులతో ఆందోళన చేపడతామని తెలిపారు.

కొన్నెంబట్టు శివార్లలో చనిపోయిన కోళ్లు



సూళ్లూరుపేట-శ్రీకాళహస్తి రోడ్డుకు పక్కన పడేసిన కోళ్లు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మండలం కొన్నెంబట్టు గ్రామ శివార్లలో సూళ్లూరుపేట-శ్రీకాళహస్తి రోడ్డు పక్కనే చనిపోయిన కోళ్లను పడేయడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని సెవెన్ స్టార్ దుకాణదారులు ఈ పని చేశారని ఆరోపిస్తున్నారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి వుందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో చనిపోయిన కోళ్లను గుంత తీసి కప్పి పెట్టాలని, రోడ్డు పక్కన వేయడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. అంతేగాకుండా సూళ్లూరుపేటలోని చికెన్ దుకాణాల వారు వేస్ట్‌ను ఇక్కడే డంప్ చేస్తున్నారని వాపోతున్నారు.

బాధితుడికి న్యాయం చేయాలి

నాయుడుపేట టౌన్ : పట్టా భూమిని ఇతరులు ఆక్రమించుకున్నారు.. న్యాయం చేయాలని బాధితుడు పలుమార్లు కోరినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని అఖిల భారత మానవ హక్కుల పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ సాల్మన్‌రాజ్ ఆరోపించారు. ఆయన శనివారం బాధితుడు ప్రసాద్‌తో కలిసి తహసీల్దారు కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. మేనకూరుకు చెందిన మైలారి సుబ్రహ్మణ్యం పేరుతో సర్వే నంబర్ 102 8బీలో ఉన్న 0.67 సెంట్ల భూమిని ఇతరులు ఆక్రమించుకున్నారని తెలిపారు. దీనిపై అతని కొడుకు ప్రసాద్ రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై శనివారం సూళ్లూరుపేట ఆర్డీవోకు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

'కక్షకట్టి విద్యుత్ కనెక్షన్ తొలగించారు'



విద్యుత్ కనెక్షన్‌ను తొలగిస్తున్న అధికారులు

డక్కిలి: 20 ఏళ్ల క్రితం విద్యుత్ సర్వీసు తీసుకుని పంటలు సాగు చేసుకుంటున్నానని, ఇప్పుడు కూటమి నేతల ప్రోద్బలంతో విద్యుత్ సర్వీసును తొలగించారని డక్కిలికి చెందిన మురళీరెడ్డి వాపోయాడు. అతను శనివారం విలేకరులతో మాట్లాడుతూ డక్కిలి పంచాయతీ లోని 258–1 సర్వే నంబర్‌లో ఉన్న భూమిలో తాను 20 ఏళ్లుగా పంటలు సాగు చేసుకుంటున్నట్టు తెలిపాడు. టీడీపీ నాయకుల ప్రోద్బలంతో అధికారులు తన విద్యుత్ సర్వీసును శనివారం తొలగించారని వాపోయాడు. 258–1 సర్వే నంబర్‌లో అనేకమంది రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారని, వారి విద్యుత్ సర్వీసులను తొలగించలేదని పేర్కొన్నాడు. తాను వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడినన్న కక్షతోనే విద్యుత్ కనెక్షన్‌ను తొలగించారని ఆరోపించాడు. గతంలోనే తాను హైకోర్టును ఆశ్రయించగా ఈ నెల 1న స్టేటస్కో ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. అధికారులు కోర్టు ఆదేశాలను బేఖాతరు చేశారని తెలిపాడు. అదేవిధంగా గ్రామంలో ఉన్న సెటిల్‌మెంట్ ల్యాండ్‌లో అక్రమంగా సీసీ రోడ్లు వేశారని, దాని పైనా హైకోర్టును ఆశ్రయించానని తెలిపాడు.

సర్వీసు రోడ్ల సమస్యపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నాయుడుపేట టౌన్ : సాగరమాల రోడ్డు నుంచి రైతుల పొలాలకు వెళ్లేందుకు వీలుగా సర్వీసు రోడ్లు వేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. వారు శనివారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సాగరమాల రోడ్డుకు ఇరువైపులా రైతుల పొలాలు ఉన్నాయని తెలిపారు. రోడ్డు వల్ల పొలాల్లో పంటలు సాగు చేసుకునేందుకు వీలు లేకుండా పోయిందని తెలిపారు. నాయుడుపేట ఎన్‌హెచ్ 16 నుంచి చిలమత్తూరు గ్రామం వరకు సాగరమాల రోడ్డుకు ఇరువైపులా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. జలదంకి వెంకటకృష్ణారెడ్డి, సన్నారెడ్డి హరినాథ్‌రెడ్డి, కామిరెడ్డి విజయసారథి రెడ్డి, గుండాల సురేష్ రెడ్డి, సన్నారెడ్డి భవదీప్, మద్దా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.